
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



సిద్దిపేట

5

శుక్రవారం 12 ఏప్రిల్ 2024



సిద్దిపేటలో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

భక్తిశ్రద్ధలతో రంజాన్

- ఈద్గా, మసీదుల వద్ద ప్రత్యేక ప్రార్థనలు
- రంజాన్ విశిష్టతను వివరించిన మతపెద్దలు
- శుభాకాంక్షలు తెలిపిన ఆయా పార్టీల నాయకులు



సిద్దిపేటలోని ఈద్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



సిద్దిపేట అర్బన్, ఏప్రిల్ 11 : ఈద్ ఉల్ ఫితర్ (రంజాన్) వేడుకలను జిల్లాలో గురువారం ఘనంగా నిర్వహించుకున్నారు. తెల్లవారుజామున 7 నుంచి 11 వరకు ప్రార్థనలు జరిగాయి. రంజాన్ పండుగ నేపథ్యంలో జిల్లావ్యాప్తంగా అన్ని ఈద్గాలలో సామూహిక ప్రార్థనల కోసం జిల్లా వక్ఫ్‌బోర్డు కమిటీ, జిల్లా ముస్లిం మతపెద్దలు అన్ని ఏర్పాట్లు చేశారు. ఆయా గ్రామాల్లోని మసీదులు, ఈద్గాలలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. మతపెద్దలు రంజాన్ విశిష్టతను వివరించారు. రంజాన్ సందర్భంగా ఈద్గాల వద్ద ముస్లింలకు స్థానిక ఎమ్మెల్యే మాజీమంత్రి హరీశ్‌రావు శుభాకాంక్షలు తెలియజేశారు. అలాగే కాంగ్రెస్ పార్టీ సిద్దిపేట నియోజకవర్గ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ వేడుకల్లో పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు.



ఫారుక్ హుస్సేన్‌ను ఆలింగనం చేసుకుని శుభాకాంక్షలు చెబుతున్న హరీశ్‌రావు



రంజాన్ వేడుకల్లో పాల్గొన్న కాంగ్రెస్ పార్టీ సిద్దిపేట నియోజకవర్గ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ





కలెక్టరేట్‌లో జ్యోతిరావు పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న కలెక్టర్ మనుచౌదరి, అధికారులు, సిబ్బంది

ఘనంగా జ్యోతిరావు పూలే జయంతి

సిద్దిపేట అగ్రికల్చర్, ఏప్రిల్ 11 : జ్యోతిరావుపూలే జయంతిని జిల్లాలో గురువారం ఘనంగా నిర్వహించారు. కలెక్టరేట్‌లో బీసీ సంక్షేమశాఖ అధికారి సరోజ ఆధ్వర్యంలో పూలే జయంతిని నిర్వహించారు. కలెక్టర్ మనుచౌదరి జ్యోతిరావు పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో డీపీవో దేవకి దేవి, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

మరిన్ని వార్తలు 8లో..

పెరిగిన విద్యుత్ వినియోగం



- గతం కంటే ఈసారి 60 మెగావాట్లు అధికం
- ముున్ముందు మరింత పెరిగే అవకాశం
- గరిష్ఠ ఉష్ణోగ్రతలూ ఓ కారణం
- గృహజ్యోతి పథకంతో రూ.5.33కోట్ల భారం

సిద్దిపేటరూరల్, ఏప్రిల్ 11 : ఉష్ణోగ్రతల మార్పులతో ఉక్కపోత, వేడి నుంచి ఉపశమనం పొందేందుకు ఫ్రిజ్‌లు, కూలర్లు, ఏసీలు, ఫ్యాన్ల కింద సేదతీరుతున్నారు. ఫలితంగా జిల్లాలో విద్యుత్ వినియోగం రోజురోజుకు పెరుగుతున్నది. గతేడాదితో పోలిస్తే ఈసారి మార్చిలో విద్యుత్ వినియోగం 9.44 శాతం పెరిగింది. విద్యుత్ వినియోగం పెరగడానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన గృహజ్యోతి ఉచిత పథకం కూడా ఓ కారణం. గతంలో 100 యూనిట్ల వరకు వినియోగించేవారు, ఇప్పుడు ఆ వినియోగం పెరిగిందనే చెప్పాలి. గతేడాది మార్చిలో 635 మెగావాట్ల విద్యుత్ ఖర్చవగా ఈసారి మార్చిలో 695 మెగావాట్ల విద్యుత్‌ను వినియోగించారు. సుమారు 60 మెగావాట్ల విద్యుత్ వినియోగం పెరిగింది. ఈనెలతో పాటు మే, జూన్‌లో ఉష్ణోగ్రతలు అధికంగా ఉండనున్నాయి. విద్యుత్ వినియోగం కూడా మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు.

సిద్దిపేట జిల్లాలో 1,71,266 మంది గృహ విద్యుత్ వినియోగదారులు ఉన్నారు. అందులో 1,64,689 మంది గృహ జ్యోతి పథకం లబ్ధిదారులు కాగా 582 మంది మాత్రమే బిల్లులు చెల్లించారు. మిగిలిన వారి బిల్లుల భారం రూ. 5,33,55,966 జిల్లా విద్యుత్‌శాఖపై పడింది. ఇక ప్రతినెలా నగదు బిల్లుల చెల్లింపులు కూడా తగ్గాయి. జిల్లాలో కాలువల ద్వారా సాగునీరు అందించే పరిస్థితి లేకపోవడంతో రైతు లు బోరుబావుల పై ఆధార పడి సాగు చేస్తున్నారు. దీంతో బోరుబావుల వద్ద కూడా విద్యుత్ వినియోగం మరింత పెరిగింది. పంటలను కాపాడుకునేందుకు రైతులు రాత్రింబవళ్లు విద్యుత్‌పై ఆధారపడడం కూడా కారణం.



పొదుపుగా వాడండి



వినియోగదారులు విద్యుత్‌ను పొదుపుగా వాడాలి. అత్యవసరమైతే తప్ప ఫ్యాన్లు, ఫ్రిజ్‌లు, కూలర్లు, ఏసీలు వినియోగించవద్దు. రైతులు సింగిల్ ఫేస్ మోటార్లకు నిరంతరంగా విద్యుత్ సరఫరా ఇవ్వడం సరికాదు. రైతులు వ్యవసాయ బావుల వద్ద ఉన్నప్పుడు మాత్రమే మోటార్లను ఆన్‌చేసి పొలాలకు నీరందించాలి. ఆటోమెటిక్ స్టార్టర్స్ బిగించి విద్యుత్‌ను నిరంతరాయంగా వినియోగించడం వల్ల భూగర్భజలాలు కూడా అడుగంటుతాయి. వాణిజ్య, వ్యాపార సంస్థల నిర్వహకులు తగిన జాగ్రత్తలు పాటించాలి. గత సంవత్సరంతో పోలిస్తే ఈసారి విద్యుత్ డిమాండ్ పెరిగింది. అయినప్పటికీ అవసరమైన మేరకు విద్యుత్ అంతరాయం లేకుండా సరఫరా చేస్తున్నాం. డివిజన్ల వారిగా ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశాం. విద్యుత్ సరఫరాలో అంతరాయం కలిగితే డివిజన్ కేంద్రాలలో సంప్రదించాలి.

- మోహన్‌రెడ్డి, విద్యుత్ శాఖ జిల్లా అధికారి, సిద్దిపేట

మోదీని మరోసారి ప్రధానిని చేయడానికి

ప్రజలు సిద్ధంగా ఉన్నారు

- ఎన్నికల నిబంధనలు అతిక్రమించిన వెంకట్రామారెడ్డిపై ఎందుకు చర్యలు తీసుకోలేదు?
- ఆయన నిర్వాకానికి ఉద్యోగులు బలయ్యారు
- త్వరలోనే హరీశ్‌రావు, వెంకట్రామారెడ్డి జైలుకు..
- బీజేపీ ఎంపీ అభ్యర్థి రఘునందన్‌రావు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న రఘునందన్‌రావు

సిద్దిపేట క్రైం, ఏప్రిల్ 11: మోదీని మూడోసారి ప్రధానిని చేయడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని బీజేపీ మెదక్ పార్లమెంట్ అభ్యర్థి రఘునందన్‌రావు అన్నారు. గురువారం ఉదయం ఆయన సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కాలేజీ మైదానంలో, కోమటి చెరువు నెక్లెస్ రోడ్‌పై మార్నింగ్ వాక్ ప్రచారంలో పాల్గొన్నారు. అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. దేశానికి కేజ్రీవాల్ లాంటి వాళ్లు కాదు అన్నహజారే లాంటివారు కావాలన్నారు. బీఆర్ఎస్ అభ్యర్థి వెంకట్రామారెడ్డి గతంలో కలెక్టర్‌గా, ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా పనిచేశారని, ఆయనకు ఎన్నికల నిబంధనల గురించి, పార్టీ మీటింగ్‌లకు ఉద్యోగులను పిలవకూడదు అనే విషయం తెలియదా అని ప్రశ్నించారు. ఆయన చేసిన పనికి ఉద్యోగులు బలయ్యారని మండిపడ్డారు. ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించిన ఉద్యోగులపై చర్యలు తీసుకున్న ఎన్నికల సంఘం వెంకట్రామారెడ్డిపై ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. కేసీఆర్ కుటుంబంలో కొందరు జైలుకు వెళ్లారని, హరీశ్‌రావు, ఎంపీ అభ్యర్థి వెంకట్రామారెడ్డి కూడా జైలుకు వెళ్తారన్నారు. 2018లో తాను ఇచ్చిన హామీని ఇప్పుడు కొందరు రాజకీయం చేస్తున్నారని, దమ్ముంటే తనతో చర్చకు రావాలన్నారు. ఆయన వెంట బీజేపీ జిల్లా అధ్యక్షుడు మోహన్‌రెడ్డి, జిల్లా మాజీ అధ్యక్షుడు శ్రీకాంత్ రెడ్డి, నాయకులు, వెంకట్,



ఆరోగ్య ఫలం

- ఎండ వేడిమికి పండ్ల రసాలతో ఉపశమనం
- జ్యూస్‌లపై మక్కువ చూపుతున్న ప్రజలు

7 లో..

సిద్దిపేట అంటే బీఆర్ఎస్ అడ్డా

- దేవుడి పేరు చెప్పి రాజకీయాలు చేయొద్దు
- నల్ల చట్టాలు తెచ్చి 700 మంది రైతులను పొట్టనపెట్టుకున్న బీజేపీ ప్రభుత్వం
- మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు



పెద్దకోడూరులో నిర్వహించిన సన్నాహక సమావేశంలో మాట్లాడుతున్న మాజీమంత్రి హరీశ్‌రావు

చిన్నకోడూరు, ఏప్రిల్ 11 : సిద్దిపేట అంటే బీఆర్ఎస్ అడ్డా అని.. దేశం మొత్తం పేరున్నదన్నారు. కుప్పం అనగానే చంద్రబాబునాయుడి పేరు వస్తది, పులివెందుల అనగానే రాజశేఖర్ రెడ్డి పేరు వస్తది అని, సిద్దిపేట అంటే కేసీఆర్ పేరు కాపాడాలా వద్దా అని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. చిన్నకోడూరు మండలం పెద్దకోడూరులోని ఓ ఫంక్షన్‌హాల్‌లో గురువారం నిర్వహించిన మండల స్థాయి పార్టీ శ్రేణుల సన్నాహక సమావేశానికి ఆయన హాజరై బీఆర్ఎస్ మెదక్ ఎంపీ అభ్యర్థి వెంట్రామారెడ్డితో కలిసి మాట్లాడారు. దేవుడు అందరికీ సమానమేనని, దేవుడి పేరు చెప్పి రాజకీయాలు చేయొద్దన్నారు. పదేళ్లలో బీజేపీ ప్రభుత్వం పెట్రోలు, డీజిల్, గ్యాస్ ధరలు విపరీతంగా పెంచిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. పదేళ్లలో ఆకలి, పేదరికం, నిరుద్యోగం పెరిగిందన్నారు. నల్లచట్టాలను తీసుకొచ్చి 700 మంది రైతులను బీజేపీ ప్రభుత్వం పొట్టన పెట్టుకున్నదని చెప్పారు. ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలని చెప్పి కనీసం పది లక్షల ఉద్యోగాలు కూడా ఇవ్వలేదన్నారు. బీఆర్ఎస్ అంటే తెలంగాణ గొంతుక అని, రేపు ఢిల్లీలో జై తెలంగాణ అని అనాలంటే ఒక్క గులాబీ కండువా కప్పుకున్నవాడే అంటాడని పేర్కొన్నారు. కాంగ్రెస్, బీజేపీ వాళ్లు అనరని వాళ్లు ఢిల్లీ పార్టీలకు గులాం గిరీ చేస్తారని విమర్శించారు. రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాడు.. ఎప్పుడైనా జై తెలంగాణ అన్నాడా? అని హరీశ్‌రావు ప్రశ్నించారు. కాంగ్రెస్, బీజేపీ దొందూ దొందేనని, ఇద్దరూ రైతు వ్యతిరేకులేనన్నారు. నిజమైన రైతు నేస్తం కేసీఆర్ అని, రైతులకు మేలు చేసింది కేసీఆరేనని పేర్కొన్నారు.

బీఆర్ఎస్ ప్రభుత్వం కంటే ముందు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ముఖ్యమంత్రులుగా రోశయ్య, కిరణ్‌కుమార్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి ఉన్నప్పుడు పగటి పూట 3 గంటలు, రాత్రిపూట 3 గంటలు మొత్తం ఆరు గంటలు విద్యుత్ వచ్చేదన్నారు. కేసీఆర్ రూ.90 వేల కోట్లు ఖర్చుచేసి మోటార్లు, ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోకుండా 24 గంటలు ఉచిత విద్యుత్ ఇచ్చారని ఈ సందర్భంగా గుర్తు చేశారు. మిషన్ భగీరథతో తాగునీటి, కాళేశ్వరం ప్రాజెక్టుతో సాగునీటి కష్టాలు తీర్చారన్నారు. రాష్ట్రంలో లక్షల ఎకరాల్లో పంటలు ఎండిపోయాయని, గ్రామాల్లో బావుల కాడ మోటార్లు కాలుతున్నాయని, క్రేన్లతో బావుల్లో పూడికలు తీస్తున్నారని, మళ్లీ రైతులు కొత్తగా బోర్లు వేస్తున్నారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీలు అమలు చేస్తామని నమ్మబలికి నయవంచన చేసిందన్నారు. దుబ్బాకలో చెల్లని రూపాయి సిద్దిపేటలో చెల్లుతుందా అంటూ రఘునందన్‌రావును ఉద్దేశించి ఆయన ఎద్దేవా చేశారు. అనంతరం బీఆర్ఎస్ మెదక్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామారెడ్డి మాట్లాడారు. ఎక్కడైతే కలెక్టర్‌గా పనిచేశానో అక్కడే నుంచే బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థిగా బరిలో ఉండడం అదృష్టంగా భావిస్తున్నట్లు చెప్పారు. 100 కోట్లతో పీవీఆర్ ట్రస్టు ఏర్పాటు చేసి నియోజకవర్గంలో ఉన్న పేద విద్యార్థులకు సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు. కారు గుర్తుకు ఓటు వేసి తనను గెలిపించాలని ఆయన కోరారు. సమావేశంలో జడ్పీచైర్‌పర్సన్ రోజాశర్మ, ఎంపీపీ మాణిక్యరెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్రకార్యదర్శి రాధాకృష్ణశర్మ, మండలాధ్యక్షుడు శ్రీనివాస్, పీఏసీఎస్ చైర్మన్‌లు సదానందం, కనకరాజు, వైస్ ఎంపీపీ పాపయ్య, ఏఎంసీ మాజీ చైర్మన్ వనిత, ఎంపీటీసీలు, మాజీ సర్పంచ్‌లు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

గొప్ప సామాజిక తత్వవేత్త జ్యోతిబాపూలే

సిద్దిపేట టౌన్ : సామాజిక దార్శనికుడిగా, వర్ణ వివక్ష వ్యతిరేక పోరాటానికి బాటలు వేసిన క్రాంతికారుడు పూలేనని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. మహాత్మా జ్యోతిబాపూలే జయంతి సందర్భంగా గురువారం సిద్దిపేటలోని తన నివాసంలో పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ వివక్ష లేని సమానత్వ సమాజం కోసం జీవితాంతం శ్రమించిన గొప్ప సామాజిక తత్వవేత్త జ్యోతిబా పూలేనని కొనియాడారు. అంబేద్కర్, జ్యోతిబాపూలే, బాబు జగ్జీవన్‌రామ్ కన్న కలలను గత బీఆర్ఎస్ ప్రభుత్వం పాలనలో నిజం చేశామని చెప్పారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాజనర్సు, మచ్చ వేణుగోపాల్‌రెడ్డి, మారెడ్డి రవిందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



















దుబ్బగుట్ట ఆలయాభివృద్ధికి కృషి చేస్తా

● వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ



ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న మంత్రి దామోదర్ రాజనర్సింహ

టేక్మాల్, ఏప్రిల్ 11: దుబ్బగుట్ట ఆలయాభివృద్ధికి కృషి చేస్తానని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ పేర్కొన్నారు. మండలంలోని ధనుర గ్రామ శివారులో కొనసాగుతున్న దుబ్బగుట్ట జాతరలో భాగంగా గురువారం వేంకటేశ్వరస్వామి అలిమేలుమంగా పద్మావతిల కల్యాణోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అంతకుముందు ఉత్సవమూర్తులను పట్టువస్త్రాలతో అలంకరించి గుట్ట పైనుంచి పల్లకిలో మోసుకుంటూ కల్యాణ మండపంలోకి తీసుకొచ్చారు. కల్యాణం అనంతరం మంత్రిని ఆలయ కమిటీ సభ్యులు శాలువాలతో సత్కరించి, తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కో ఆప్షన్ మెంబర్ యూసుఫ్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు నిమ్మ రమేష్, నాయకులు సత్యనారాయణ, మల్లారెడ్డి, మాన్‌కిషన్, విష్ణువర్ధన్‌రెడ్డి, రాజగౌడ్, కిషోర్, సాగర్, శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జహీరాబాద్ పార్లమెంట్ నుంచి పోటీచేస్తా

● అంబికా శివయోగి మహరాజ్



విలేకరులతో మాట్లాడుతున్న అంబికా శివయోగి మహరాజ్

రేగోడు, ఏప్రిల్ 11: హిందూ ధర్మం, సనాతన సిద్ధాంతాల కోసం జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి నేషనల్ మహాసభ పార్టీ తరఫున పోటీ చేస్తానని దుద్యాల సర్వేశ్వరపురి పీఠాధిపతి అంబికా శివయోగి మహరాజ్ అన్నారు. మంగళవారం రాత్రి దుద్యాల ఆశ్రమానికి వెళ్తూ రేగోడులో విలేకరులతో మాట్లాడారు. నేషనల్ మహాసభ పార్టీ రాష్ట్రంలోని సికింద్రాబాద్, మెదక్, భువనగిరి, జహీరాబాద్ స్థానాల్లో అభ్యర్థులను ప్రకటించిందని, అందులో జహీరాబాద్ నుంచి తన పేరు ప్రకటించడం గర్వంగా ఉన్నదన్నారు. ఓట్ల కోసం నాయకులు మోసపూరిత వాగ్దానాలు చేస్తూ ప్రజలను మభ్యపెడుతున్నారని అన్నారు. హిందువుల ధర్మం కోసం పోరాడతానని, అందరికీ ఉచిత విద్య, వైద్యం, నిరుద్యోగులకు ఉచిత శిక్షణ ఉపాధి కల్పన, పరిశ్రమలు ఏర్పాటు, నదులకు దగ్గరలో ఉన్న ఆలయాల వద్ద ఘాట్ల ఏర్పాటుకు కృషి చేస్తానని పేర్కొన్నారు.

వాచ్‌మన్లపై గుర్తు తెలియని వ్యక్తుల దాడి



వాచ్‌మన్‌ను విచారిస్తున్న పోలీసులు

శివ్వంపేట, ఏప్రిల్ 11: ఫాంహౌస్‌లోకి చొరబడ్డ గుర్తు తెలియని వ్యక్తులు వాచ్‌మన్లపై దాడిచేసి చోరీకి పాల్పడ్డాడు. ఈ సంఘటన గురువారం పిల్లుట్లలో చోటు చేసుకున్నది. మండల పరిధిలోని పిల్లుట్ల గ్రామంలో హైదరాబాద్‌కు చెందిన శైలేందర్‌గుప్తా రెండు ఎకరాల పది గుంటల వ్యవసాయ భూమిని కొనుగోలు చేసి ఫాంహౌస్ నిర్మించాడు. బుధవారం రాత్రి ఇద్దరు వాచ్‌మన్లు నిద్రిస్తుండగా గుర్తు తెలియని దుండగులు చొరబడి దాడిచేసి సెల్‌ఫోన్లను అపహరించుకుపోయారు. సీసీ కెమెరాలను, హార్డ్ డిస్క్‌లను ధ్వంసం చేశారు. తూప్రాన్ డీఎస్పీ వెంకట్‌రెడ్డి, సీఐ కృష్ణ, ఎస్ఐ మహిపాల్‌రెడ్డి సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఆరోగ్య ఫలం

● ఎండ వేడిమికి పండ్ల రసాలతో ఉపశమనం ● జ్యూస్ సెంటర్లపై మక్కువ చూపుతున్న ప్రజలు



హుస్నాబాద్‌లో చెరకు జ్యూస్ తాగుతున్న యువకులు



హుస్నాబాద్‌లో పుచ్చకాయలు కొనుగోలు చేస్తున్న జనం



తర్బూజా

హుస్నాబాద్, ఏప్రిల్ 11: తీవ్రమైన ఎండలతో ఉష్ణోగ్రతలు పెరిగిపోయాయి. ఈ ఎండలకు ప్రజలు బయటకు రావాలంటే జంకుతున్నారు. వేసవి తాపానికి పండ్లతో పాటు పండ్ల రసాలు ఎంతో మేలు చేస్తాయి. వాతావరణంలోని అధిక ఉష్ణోగ్రతలకు శరీరం కోల్పోయిన నీటిని తిరిగి అందించడం, జీర్ణ సంబంధిత సమస్యలను దూరం చేయడం.. ఇలా పలు రకాలుగా పండ్లు మన ఆరోగ్యానికి మేలు చేస్తాయి. ఈ నేపథ్యంలో వేసవిలో లభించే పండ్లు.. వాటి వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాలను తెలుసుకుందాం..

కీర దోసకాయ

చూడగానే తినాలనిపించే కీర దోసకాయ వేసవిలో ఎంతో ఉపయోగపడుతుంది. దానిలోని పుష్కలమైన పోషకాలు శరీరానికి మేలు చేస్తాయి. రీహైడ్రేటింగ్ ఏజెంటుగా పనిచేస్తున్నది. పొటాషియం, మెగ్నీషియం అధికంగా ఉండటంతో రక్తపోటుతో బాధపడే వారికి ఇది చక్కని ఆహారం. చెమట ద్వారా కోల్పోయిన నీటిని, లవణాలను శరీరానికి తిరిగి అందించడంతో కీరదోస చక్కని పాత్ర పోషిస్తుంది. ఇందులో విటమిన్ ఏ, నీలు పుష్కలంగా ఉంటాయి. శక్తి కిలో కెలోరిలు 13, మాంస కృతులు 0.4 గ్రా, కార్బోహైడ్రేట్స్ 2.5 గ్రా, కొవ్వు పదార్థాలు 0.1గ్రా, పీచు పదార్థాలు 2.6 గ్రా, సోడియం 10.2మి.గ్రా, పొటాషియం 50 మి.గ్రా ఉంటాయి.

శరీరంలో వేడిని తీసే తర్బూజ

తర్బూజ శరీరంలోని వేడిని తీసివేస్తుంది. వేసవిలో చల్లదనాన్ని ఇస్తుంది. వేసవిలోనే ఎక్కువగా లభించే తర్బూజాలో 95.9 శాతం నీరు ఉంటుంది. ఇందులో కాల్షియం, పిండి పదార్థాలు, ఫాస్పరస్, మాంస కృతులు, ఇనుము, సోడియంలు ఉంటాయి. మూత్ర సంబంధ వ్యాధులను నయం చేస్తుంది. చర్మవ్యాధుల నివారణకు ఉపయోగపడుతుంది.



క్రిములను నాశనం చేసే పైనాపిల్

పైనాపిల్‌లో నీరు 86.5 శాతం ఉంటే విటమిన్ సి, విటమిన్ ఎ, విటమిన్ బీ, చక్కెర, ఇనుము, మాంస కృతులు ఉంటాయి. పొట్టలో ఉత్పత్తి అయ్యే గ్యాస్‌ను దూరం చేస్తుంది. పేగుల్లోని క్రిములను నాశనం చేస్తుంది.

వేసవిలో ఆరోగ్యాన్నిచ్చే పండ్లు ఎన్నో..

ఇవే కాకుండా వేసవిలో ఇంకా ఎన్నో పండ్లు ఆరోగ్యాన్ని కాపడుతాయి. సపోట, అరటి, కమల పండు, నేరేడు, జామ, బొప్పాయి, పండ్లలో లభించే ఎ విటమిన్ ఎంతో ఉపయోగపడుతుంది. చెరుకు రసం వేసవిలో ఆరోగ్యానికి మేలు. పండ్లకంటే పండ్ల రసాలు ఎంతో ఉపయోగపడుతాయి.

ఆరోగ్యానికి నిమ్మతో మేలు



వేసవిలో నిమ్మ రసం ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. ఇందులో విటమిన్ సి కలిగి రోగ నిరోధక శక్తిని పెంచుతుంది. దీనిలో ఉండే పదార్థాలు కెన్సర్ రాకుండా చేస్తాయి. నిమ్మరసం సేవిస్తే కాలేయం శుభ్ర పడుతుంది. చర్మ సౌందర్యానికి ఉపయోగపడుతుంది. ఇందులో శక్తి 30కి క్యాలరీస్, పిండి పదార్థాలు 9 గ్రా. చక్కెరలు 2.5 గ్రా, పీచు పదార్థాలు 2.8 గ్రా, కొవ్వు పదార్థాలు 0.3 గ్రా, మాంస కృతులు 11 గ్రా, నీరు 89 గ్రా, విటమిన్ సి 53 ఎంజి ఉంటుంది.

వేడి, నీరసాన్ని తగ్గించే ద్రాక్ష



ద్రాక్ష వేడి, నీరసాన్ని తగ్గిస్తుంది. ఆరోగ్యానికి ఈ పండ్లు ఎంతో ముఖ్యమైనవి. ఇందులో కాల్షియం, సోడియం, పొటాషియంలతో పాటు నీరు 88.5 శాతం, పాస్పరస్ 0.02, పిండి పదార్థాలు 10.2 ఇనుము 0.4, మాంసకృతులు 0.6, కాల్షియం 0.03, విటమిన్ ఎ 151 ఐయూ, విటమిన్ బి 10.3, విటమిన్ సి 10 మి.గ్రాములుంటాయి. ద్రాక్ష మల బద్ధకాన్ని, ఫైల్స్‌ను నివారిస్తుంది. మూత్ర సంబంధిత వ్యాధులను తగ్గించి రక్తాన్ని శుద్ధి చేస్తుంది. క్యాన్సర్ నివారణకు కూడా ఉపయోగపడుతుంది. బరువు తగ్గడానికి ఉపయోగపడుతుంది.

శక్తినిచ్చే కొబ్బరిబోండాం



వేసవిలో కొబ్బరి బోండాం ఎంతో శక్తినిస్తుంది. వేడిని తగ్గించడానికి ఇది చాలా ఉపయోగపడుతుంది. ఎండాకాలంలో ఎక్కువగా దొరికే కొబ్బరిబోండాల్లో చక్కెర శాతం ఎక్కువగా ఉంటుంది. ఈ కాలంలో ఆరోగ్యంగా ఉండటానికి దోహదపడుతుంది. పిల్లలకు కొబ్బరి బోండాలు వేసవిలో ఆరోగ్యంగా ఉంచడానికి ఉపయోగపడుతాయి.

మామిడి పండుతో లాభాలెన్నో



పండ్లలో రాజు అయిన మామిడి పండుతో లాభాలు అన్నీ ఇన్నీ కావు. పండిన మామిడిలో 12గ్రా పిండి పదార్థాలు, కాల్షియం 17 మి.గ్రా, మాంస కృతులు 0.6, పాస్పరస్ 20, కొవ్వు పదార్థాలు 0.1, ఇనుము 0.8, విటమిన్ ఎ 4,800 నుంచి 22,550 ఐయూ, పొటాషియం 250, విటమిన్ బి1 42,755, సోడియం 7, విటమిన్ బి250, నియాసిస్ 0.3, విటమిన్ సి 150 గ్రాములు ఉంటాయి. ఇందులో సిట్రిక్ యాసిడ్‌తో పాటు పిప్పి పదార్థాలుంటాయి. దీంతో మలబద్దక నివారణతో పాటు కాలేయం, పేగులు చురుకుదనంగా పనిచేయడానికి ఉపయోగపడుతుంది.

నీరు అధిక శాతం ఉండే పుచ్చకాయ



పుచ్చకాయ(వాటర్ మిలన్) అధిక శాతం నీరు ఉంటుంది. ఇది వేసవిలో దాహార్తిని తీర్చుతుంది. ఇందులో కాల్షియం, ఇనుము, సల్ఫర్, కాపర్‌లు ఎక్కువగా ఉంటాయి. రక్త హీనతను తగ్గించడంతో పాటు మల బద్ధకాన్ని దూరం చేస్తుంది. కడుపులో మంటను అరికడుతుంది.



దానిమ్మతో జ్వరానికి చెక్

జ్వరం తగ్గడానికి దానిమ్మ పండు ఎంతో ఉపకరిస్తుంది. ఈ పండు తేలిగ్గా జీర్ణమవుతుంది. ఇందులో 78శాతం నీరు ఉంటుంది. విటమిన్ సి 16 మి.గ్రా, పిండి పదార్థాలు 14.5, కాల్షియం 0.01, మాంసకృతులు 1.7, పాస్పరస్ 0.7, ఇనుము 0.03, విటమిన్ బి 10 మి.గ్రా ఉంటుంది. గుండెపోటుకు, మల్ల బద్ధకాన్ని నివారిస్తుంది.

మల్లన్న ఆలయ సూపరింటెండెంట్ శేఖర్ రిలీవ్

● డిప్యూటేషన్‌పై కొండగట్టుకు..



సూపరింటెండెంట్ శేఖర్‌ను సత్కరిస్తున్న ఈవో బాలాజీశర్మ

చేర్యాల, ఏప్రిల్ 11: కొమురవెల్లి మల్లికార్జునస్వామి ఆలయ సూపరింటెండెంట్ నీల శేఖర్‌ను కొద్దిరోజుల క్రితం కొండగట్టు ఆంజనేయస్వామి ఆలయానికి డిప్యూటేషన్‌పై బదిలీ చేసిన నేపథ్యంలో గురువారం రిలీవ్ చేశారు. చాన్నాళ్లకాలంగా మల్లన్న ఆలయంలో పనిచేస్తున్నాడన్న కారణంగా దేవాదాయశాఖ కమిషనర్‌కు ఫిర్యాదులందడంతో ఏడాదికాలం పాటు డిప్యూటేషన్‌పై కొండగట్టు ఆంజనేయస్వామి ఆలయానికి బదిలీ చేస్తూ గత మార్చి 14న దేవాదాయశాఖ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీచేశారు. కానీ ఆ సమయంలో బ్రహ్మోత్సవాలు కొనసాగుతున్నందున కార్యకలాపాల నిర్వహణలో ఇబ్బందులు తలెత్తుతాయని నిలుపుదల చేశారు. ఇటీవల జాతర ముగియడంతో ఎట్టకేలకు గురువారం రిలీవ్ చేశారు. ఈవో బాలాజీశర్మ, ఏఈవో బుద్ది శ్రీనివాస్, ఉద్యోగులు, అర్చకులు సన్మానించి వీడ్కోలు పలికారు.

గ్రూప్ సర్వీస్‌లకు ఉచిత శిక్షణ

● జిల్లా ఎస్సీ అభివృద్ధి అధికారి అఖిలేష్‌రెడ్డి



అఖిలేష్‌రెడ్డి

సంగారెడ్డి అర్బన్, ఏప్రిల్ 11: సంగారెడ్డిలోని సమీకృత బాలుర వసతి గృహంలో గ్రూప్-1,2,3,4 సర్వీస్‌లకు మూడునెలల ఫౌండేషన్ కోర్సుకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లా ఎస్సీ అభివృద్ధి అధికారి అఖిలేష్‌రెడ్డి తెలిపారు. డిగ్రీ పూర్తి చేసిన ఎస్సీ విద్యార్థులు నేరుగా స్టడీ సెంటర్‌కు వచ్చి అడ్మిషన్ పొందాలని సూచించారు. అడ్మిషన్ పొందిన వారికి ఉచితంగా హాస్టల్ వసతి కల్పించడంతో పాటు ఉచితంగా స్టడీ మెటీరియల్ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఈ సదావకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. వివరాలకు 9440478004, 9393941575 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

తవ్వకాల్లో బయటపడిన శిలాతోరణం



తవ్వకాల్లో బయటపడిన గ్రామదేవతల శిలాతోరణం

మెదక్ అర్బన్, ఏప్రిల్ 11: జిల్లా కేంద్రంలోని కుమ్మరిగల్లిలో గ్రామదేవతల పురాతన శిలాతోరణం బయటపడింది. స్థానిక రాందాస్ చౌరస్తా నుంచి దాయర వరకు రోడ్డు విస్తరణ పనులు జరుగుతున్నాయి. అందులో భాగంగా తవ్వకాలు చేపట్టారు. రాళ్లు తొలగిస్తున్నప్పుడు గ్రామదేవతల శిలాతోరణం బయటపడింది. ఈ విషయం తెలుసుకున్న స్థానికులు పూజలు చేశారు. ఇంకా భూమిలో ఆరు విగ్రహాలు ఉన్నట్లు అనుమానిస్తున్నామని, అన్ని బయటకు తీయాలని అభివృద్ధి పోరాట సమితి అధ్యక్షుడు మహిపాల్ డిమాండ్ చేశారు. దాదాపు వందేళ్ల నాటివిగా భావిస్తున్నట్లు కాలనీవాసులు తెలిపారు.

ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వ్యక్తి మృతి

జీడిమెట్ల, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాలతో పాటు పుట్టింటికి వెళ్లిన భార్య తిరిగి రాకపోవడంతో మనస్తాపానికి గురైన వ్యక్తి ఆత్మహత్యాయత్నానికి పాల్పడి చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఈ సంఘటన జీడిమెట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సంగారెడ్డి జిల్లా కంకోలు గ్రామానికి చెందిన మంగలి సురేష్((29) బతుకుదెరువు కోసం భార్య స్వప్నతో కలిసి నగరానికి వచ్చి గాజులరామారం ప్రాంతంలోని ఓ అపార్టుమెంట్‌లో వాచ్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. ఖాళీ సమయంలో కార్పెంటర్‌గా పనికి వెళ్తున్నాడు. ఇటీవల భార్యాభర్తల మధ్య గొడవలు జరిగాయి. భార్య పుట్టింటికి వెళ్లి ఎంతకీ తిరిగిరాలేదు. దీంతో మనస్తాపానికి గురైన సురేష్ ఫిబ్రవరి 26న తాగిన మైకంలో ఒంటిపై పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యకు యత్నించాడు. స్థానికులు గుర్తించి మంటలు ఆర్పి హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించారు. అప్పటి నుంచి చికిత్స పొందుతూ బుధవారం సాయంత్రం మృతిచెందాడు. ఈ మేరకు జీడిమెట్ల పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఇంటి వద్దకే రాములోరి తలంబ్రాలు

● రూ.151 చెల్లిస్తే తలంబ్రాలు బుకింగ్
● ఈ నెల 18వ తేదీవరకు బుకింగ్‌కు అవకాశం
● ఆర్టీసీ కార్గో ద్వారా పంపిణీ



భద్రాద్రి రాములోరి తలంబ్రాలు(ఫైల్)

సంగారెడ్డి అర్బన్, ఏప్రిల్ 11: భద్రాద్రి రాములోరి తలంబ్రాలు కావాలనుకునే భక్తుల కోసం ఆర్టీసీ చర్యలు చేపట్టింది. గతేడాది మాదిరిగానే ఈసారి కూడా శ్రీరామనవమి సందర్భంగా భద్రాచలంలో నిర్వహించే సీతా రామచంద్రస్వామి కల్యాణానికి వెళ్లలేని భక్తులు ఇంటి వద్దే తలంబ్రాలను పొందేలా ఆర్టీసీ చర్యలు తీసుకున్నది. ఇందులో భాగంగా ఆర్టీసీ కార్గో ద్వారా పంపిణీ చేయాలని నిర్ణయించింది. అయితే ఈనెల 18వ తేదీ వరకు తలంబ్రాలు బుకింగ్ చేసుకునే అవకాశం ఆర్టీసీ కల్పించింది. టీఎస్‌ఆర్టీసీ లాజిస్టిక్ కేంద్రాల్లో రూ.151 చెల్లించి వివరాలు నమోదు చేసుకుని తలంబ్రాలు బుక్ చేసుకోవాలని ఆర్టీసీ అధికారులు సూచిస్తున్నారు. గతేడాది ఆర్టీసీ ఇదే తరహాలో రాములోరి కల్యాణ తలంబ్రాలను భక్తులకు ఇంటి వద్దకే అందించగా, ఆ క్రమంలో భక్తుల నుంచి అనూహ్య స్పందన రావడంతో.. తాజాగా ఈ యేడు కూడా పంపిణీ చేసేందుకు ప్రణాళిక రూపొందించింది.

తలంబ్రాల కోసం డిపోల వారీగా..

తలంబ్రాల కోసం మెదక్ డిపో-9154298642, నారాయణ ఖేడ్-9154298648, సంగారెడ్డి-9154298652, జహీరాబాద్-9154298657, సిద్ది పేట-9154298660, దుబ్బాక-9154298664, గజ్వేల్-9154298668, ఆర్ఎం ఆఫీసు-9154298674, ఏటీఎం లాజిస్టిక్స్-8125456978 నంబర్లను సంప్రదించాలని అధికారులు తెలిపారు. గతేడాది ఉమ్మడి మెదక్ జిల్లాలోని ఏడు డిపోల పరిధిలో 9,614 మంది తలంబ్రాలు బుక్ చేసుకోగా రూ.11,15,224 ఆదాయం వచ్చిందని ఆర్టీసీ అధికారులు తెలిపారు. ఈ సారి కూడా అదే తరహాలో ఆదాయం వస్తుందని అధికారులు భావిస్తున్నారు.

ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో బుకింగ్



తలంబ్రాలు ఆన్‌లైన్(టీఎస్‌ఆర్టీసీలాజిస్టిక్.ఇన్), ఆఫ్‌లైన్‌లో బుకింగ్ చేసుకోవచ్చు. దూర ప్రాంతాల్లో ఉండి భద్రాచలంలో జరిగే రాములోరి కల్యాణానికి వెళ్లలేని భక్తులకు ఇది సువర్ణ అవకాశం. రాములోరి కల్యాణ తలంబ్రాలు ఎంతో పవిత్రమైనవి. తలంబ్రాలు పొందిన వారికి అంతా శుభమే జరుగుతుందనే భక్తులు నమ్ముతుంటారు. ఈ నెల 18వ తేదీవరకు సంబంధిత కార్గో లాజిస్టిక్ కేంద్రాల్లో వివరాలు నమోదు చేసుకుని డోర్ డెలివరీ ద్వారా తలంబ్రాలు పొందండి.

- ఉపేందర్, డిపో మేనేజర్, సంగారెడ్డి

ఒకేచోట కూర్చున్నా.. మాట్లాడుకోని ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యే



నర్సాపూర్‌లో ఒకేచోట పక్కపక్కనే నిల్చున్న ఎమ్మెల్యే సునితారెడ్డి, మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి

నర్సాపూర్, ఏప్రిల్ 11: మొన్నటివరకు ఏ కార్యక్రమంలోనైనా కలిసి పాల్గొన్న ఎమ్మెల్యే సునితారెడ్డి, మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి ఇప్పుడు ఒకేచోట పక్కపక్కనే కూర్చున్నా మాట్లాడుకోకుండా ఉండటం విశేషం. నాలుగు నెలల క్రితం జరిగిన ఎమ్మెల్యే ఎన్నికల్లో సునితారెడ్డి గెలుపుకోసం పనిచేసిన మదన్‌రెడ్డి.. ఇప్పుడు ఎడమొహం.. పెడమొహం పెట్టుకోవడానికి రాజకీయ పరిణామాలే కారణమని చెప్పవచ్చు. మదన్‌రెడ్డి బీఆర్‌ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరడానికి నిర్ణయించుకున్నారు. కాగా గురువారం నర్సాపూర్ ఈద్గా వద్ద ముస్లింలకు పండుగ శుభాకాంక్షలు తెలిపేందుకు ఇద్దరూ వచ్చి పక్కపక్కనే కూర్చున్నా.. ఒకరినొకరు పలకరించుకోకపోవడం చర్చనీయాంశంగా మారింది. అదేవిధంగా ఎమ్మెల్యే సునితారెడ్డి కూర్చున్నచోటనే మాజీ ఎమ్మెల్యేతో పాటు కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి, డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్ తదితరులు ఉన్నారు. వీరూ ఎవరికివారు పలకరించుకోకుండా శుభాకాంక్షలు తెలిపి వెళ్లడం విశేషం.

కొనసాగుతున్న బీరప్పస్వామి ఉత్సవాలు



కలశ పూజ నిర్వహిస్తున్న భక్తులు

వట్‌పల్లి, ఏప్రిల్ 11: మండల పరిధిలోని మేడుకుందలో బీరప్పస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన రెండోరోజు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జలదివాసం, పుష్పదివాసం, దానదివాసం, కలశ పూజ, హోమం తదితర కార్యక్రమాలు నిర్వహించారు.

ఇమామ్‌నగర్‌లో మల్లన్న జాతర



మల్లన్న జాతరలో జడ్పీ వైస్ చైర్మన్ ప్రభాకర్

జిన్నారం, ఏప్రిల్ 11: సోలక్‌పల్లి పరిధి ఇమామ్‌నగర్‌లో మల్లన్న జాతర ఘనంగా నిర్వహించారు. గురువారం మల్లన్న ఆలయం వద్ద స్థానికులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. జడ్పీ వైస్ చైర్మన్ ప్రభాకర్, నాయకులు ప్రభాకర్‌రెడ్డి, అంజనేయులు, రాజేష్, భార్గవ్, కృష్ణ, పరమేశ్‌రెడ్డి పాల్గొన్నారు.

బైక్ అదుపు తప్పి, ఒకరి మృతి



శ్రీధర్‌రెడ్డి(ఫైల్)

కౌడిపల్లి, ఏప్రిల్ 11: బైక్ అదుపు తప్పి కింద పడి ఒకరు మృతిచెందారు. ఈ సంఘటన మండల పరిధిలోని బుజరంపేట్‌లో బుధవారం రాత్రి చోటు చేసుకున్నది. కామారెడ్డి జిల్లా కుండారం గ్రామానికి చెందిన బండారి శ్రీధర్‌రెడ్డి 25 ఏళ్ల క్రితం మండలంలోని బుజరంపేటకు వచ్చి ఆర్ఎంపీగా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. బుధవారం రాత్రి 8 గంటలకు కొల్చారం మండల పరిధిలోని దుంపలకుంటకు ద్విచక్ర వాహనంపై వెళ్తున్నాడు. ఈ క్రమంలో అదుపుతప్పి కిందపడి మృతిచెందాడు. మృతుడి సోదరుడు శ్రీనివాస్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కౌడిపల్లి ఎస్ఐ రంజిత్‌రెడ్డి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో మహారాష్ట్ర వాసి మృతి



మృతిచెందిన సురేష్

తూప్రాన్, ఏప్రిల్ 11: రోడ్డు ప్రమాదంలో మహారాష్ట్ర వాసి గురువారం మృతిచెందాడు. ఎస్ఐ శివానందం తెలిపిన వివరాల ప్రకారం.. మహారాష్ట్ర నాందేడ్ జిల్లా డేగ్లూర్ మండలం హవర్గాకు చెందిన బర్‌సంవార్ సురేష్(45), అయిలాబాయి దంపతులు నాలుగేళ్ల క్రితం సుచిత్రకు వచ్చి కూలీ పనులు చేసుకుంటూ ఉపాధి పొందుతున్నారు. గురువారం ఉదయం 4 గంటలకు సురేష్ స్వగ్రామం వెళ్లేందుకు సుచిత్ర వద్దకు వచ్చి కామారెడ్డి వైపు వెళ్తున్న కారులో బయలుదేరాడు. తూప్రాన్ పట్టణ శివారులోని టోల్‌ప్లాజా వద్ద ఆగి ఉన్న కంటైనర్ లారీని కారు ఢీకొట్టింది. ఈ ఘటనలో కారులో ప్రయాణిస్తున్న సురేష్ అక్కడికక్కడే మృతిచెందాడు. కామారెడ్డి జిల్లా పోశన్‌పేట్‌కు చెందిన కారు డ్రైవర్ షాదుల్లా అనిల్‌కుమార్ తీవ్రంగా గాయపడ్డారు. మృతుడు సురేష్ భార్య అయిలాబాయి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వివరించారు.

గుమ్మడిదలలో యువతి అదృశ్యం



ఘరమణి(ఫైల్)

గుమ్మడిదల, ఏప్రిల్ 11: గుమ్మడిదలలో ఓ యువతి అదృశ్యమైంది. ఎస్ఐ మహేశ్వర్‌రెడ్డి వివరాల ప్రకారం.. గుమ్మడిదల గ్రామంలో నివాసముంటున్న బీహార్ రాష్ట్రానికి చెందిన ఘరమణీ అన్నారం గ్రామ శివారులో ఉన్న మోల్ టెక్ పరిశ్రమలో కూలీగా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నది. ఈనెల 10న రోజులాగే పరిశ్రమలో పనికి వెళ్లి తిరిగిరాలేదు. ఆందోళన చెందిన కుటుంబీకులు చుట్టుపక్కల, బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో తండ్రి మాయారామ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

తూప్రాన్‌లో వ్యాపారి..

తూప్రాన్, ఏప్రిల్ 11: తండ్రి మందలించడంతో వ్యాపారి ఇంట్లోంచి వెళ్లి అదృశ్యమయ్యాడు. ఈ సంఘటన తూప్రాన్ పట్టణంలో బుధవారం చోటు చేసుకున్నది. తూప్రాన్ ఎస్ఐ శివానందం వివరాల ప్రకారం.. తూప్రాన్ పట్టణానికి చెందిన మహ్మద్‌గౌస్, అతడి కుమారుడు మహ్మద్ ఫయాజ్(37)లు వ్యాపారం నిర్వహిస్తున్నారు. తమ వద్ద పనిచేసే వ్యక్తులు చెల్లింపులు చేయకపోవడంపై కుమారుడు ఫయాజ్‌ను బుధవారం తండ్రి గౌస్ మందలించాడు. దాంతో ఉదయం 11 గంటలకు కొంపెల్లి వద్ద డబ్బులు తీసుకొస్తానంటూ బైక్‌పై వెళ్లాడు. రాత్రయినా ఇంటికి రాలేదు. ఫోన్‌చేయగా స్విచ్ఛాఫ్ అని రావడంతో చుట్టుపక్కల వెతికారు. అయినా ఆచూకీ లభించకపోవడంతో గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

తూప్రాన్‌లో 305 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

● మహారాష్ట్రకు రవాణా



తూప్రాన్ వద్ద పట్టుకున్న రేషన్ బియ్యం

తూప్రాన్, ఏప్రిల్ 11: అక్రమంగా తరలిస్తున్న 305 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని తూప్రాన్ పట్టణ పరిధి టోల్‌ప్లాజా వద్ద గురువారం పట్టుకున్నారు. తూప్రాన్ ఎస్ఐ శివానందం వివరాల ప్రకారం.. హైదరాబాద్ నుంచి లారీలో 280 క్వింటాళ్లు, మరో మినీ వాహనంలో 25 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌కు రవాణా చేస్తున్నారు. తూప్రాన్ టోల్‌ప్లాజా వద్ద ఎస్ఐ శివానందం ఆధ్వర్యంలో వాహన తనిఖీలు చేపట్టగా, రెండు వాహనాల్లోని 305 క్వింటాళ్ల బియ్యం పట్టుబడ్డాయి. పట్టుబడిన బియ్యాన్ని పౌర సరఫరాల శాఖ డిప్యూటీ తహసీల్దార్ ప్రణీతారెడ్డికి అప్పగించినట్లు ఎస్ఐ వివరించారు. లారీ డ్రైవర్ నీరజ్‌కుమార్, యజమాని భాస్కర్‌రెడ్డి, చింతయ్యలపై, మినీ వాహనం డ్రైవర్ బాలాజీ, వాహన యజమాని తేజావత్ రవిపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శివానందం పేర్కొన్నారు.

18 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

కొండపాక, ఏప్రిల్ 11: అక్రమంగా నిల్వచేసిన 18 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని టాస్క్‌ఫోర్స్ పోలీసులు గురువారం పట్టుకున్నారు. కొండపాకకు చెందిన తిరుపతి సాయికృష్ణ తన ఇంట్లో అనుమతి లేకుండా రేషన్ బియ్యాన్ని దాచిపెట్టాడు. నమ్మదగిన సమాచారం మేరకు సిద్దిపేట టాస్క్‌ఫోర్స్ పోలీసులు, కుకునూరుపల్లి పోలీసులతో కలిసి దాడులు చేసి 18 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పట్టుకున్నారు. పూర్తి విచారణ అనంతరం చర్యలు తీసుకుంటామన్నారు.

బెల్ట్‌షాపుపై పోలీసుల దాడి

● 4,200 లీటర్ల విస్కీ బాటిళ్లు స్వాధీనం



స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్లను చూపుతున్న టూటౌన్ పోలీసులు

సిద్దిపేట క్రైం, ఏప్రిల్ 11: సిద్దిపేట టూ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కరీంనగర్ రోడ్డు హనుమాన్‌నగర్‌లో దండుగుల స్వప్న తన కిరాణా షాపులో అనుమతి లేకుండా బెల్ట్‌షాపు నడుపుతున్నదని సమాచారం రావడంతో గురువారం సాయంత్రం సిద్దిపేట టూటౌన్ ఇన్‌స్పెక్టర్ ఉపేందర్, సిబ్బందితో కలిసి దాడి చేశారు. ఈ దాడిలో 4,200 లీటర్ల మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా సీఐ ఉపేందర్ మాట్లాడుతూ ఇళ్లలో, హోటళ్లలో, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లలో, కిరాణా షాపులలో, ఇతర దుకాణాల్లో ప్రభుత్వ అనుమతి లేకుండా బెల్ట్‌షాపులు నడిపితే సమాచారం అందించాలని కోరారు.


సిద్దిపేటలో రంజాన్ వేడుకల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావును సన్మానిస్తున్న అత్తుఇమామ్


కొమురవెల్లి మండల కేంద్రంలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు


హుస్నాబాద్ అలంగీర్ మసీద్‌లో ముస్లింల ప్రార్థనలు


మద్దూరులో ఈద్గావద్ద సామూహిక ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

భక్తి శ్రద్ధలతో రంజాన్..

రంజాన్‌ను పురస్కరించుకుని ముస్లింలు గురువారం మసీదులు, ఈద్గాలలో ప్రార్థనలు నిర్వహించారు. ఒకరినొకరు ఆలింగనం చేసుకుని శుభాకాంక్షలు చెప్పుకున్నారు. ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు ముస్లిం సోదరులతో కలిసి ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. - ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్


కుకునూరుపల్లిలో రంజాన్ వేడుకల్లో పాల్గొన్న టీపీసీసీ అధికార ప్రతినిధి శ్రీకాంత్‌రావు


వర్గల్ మండల కేంద్రంలో ఈద్గా వద్ద ప్రార్థన అనంతరం రంజాన్ వేడుకల్లో పాల్గొన్న ముస్లింలు


చిన్నకోడూరులో సామూహిక ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు


గజ్వేల్‌లో ముస్లింలకు శుభాకాంక్షలు తెలియజేస్తున్న మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి


గజ్వేల్: ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలియజేస్తున్న బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామరెడ్డి, ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి


దుబ్బాక ఈద్గా వద్ద ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు


తిగుల్ గ్రామంలో ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు చెబుతున్న మాజీ సర్పంచ్ భానుప్రకాశ్‌రావు


గజ్వేల్ ఆర్అండ్ఆర్ కాలనీలో రంజాన్ సందర్భంగా ప్రార్థనలు నిర్వహిస్తున్న ముస్లింలు


క్షీరాసాగర్‌లో ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలుపుతున్న కేబీఆర్ ఫౌండేషన్ చైర్మన్ బాల్‌రెడ్డి


నారాయణరావుపేట మండల కేంద్రంలో ఈద్గా వద్ద ప్రార్థనలు చేస్తున్న ముస్లిం సోదరులు


రంజాన్ సందర్భంగా రాయపోల్ ఈద్గాలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు


హుస్నాబాద్‌లో బీఆర్ఎస్ నాయకుడు ఎండీ అన్వర్ ఇంట్లో జరిగిన రంజాన్ వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీష్‌కుమార్

నేడు కాంగ్రెస్ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం

గజ్వేల్, ఏప్రిల్ 11: ఈ నెల 12న గజ్వేల్ పట్టణంలో నియోజకవర్గ స్థాయి కార్యకర్తల సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు, గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి తెలిపారు. గజ్వేల్ పట్టణంలోని ఆయన నివాసంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా మంత్రులు దామోదర రాజనర్సింహ, కొండా సురేఖ, మాజీ ఎమ్మెల్యేలు మైనంపల్లి హనుమంతరావు, జగ్గారెడ్డి, మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్, కాంగ్రెస్ మెదక్ నియోజకవర్గ పార్లమెంట్ అభ్యర్థి నీలం మధు ముదిరాజ్‌లు హాజరవుతున్నట్లు తెలిపారు. ఈ సమావేశానికి కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు, అభిమానులు, యువజన కాంగ్రెస్ నాయకులు, ఎన్ఎస్‌యూఐ, మహిళా కాంగ్రెస్ నాయకులు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. గజ్వేల్ మండలం శ్రీగిరిపల్లి గ్రామానికి చెందిన గౌడ సంఘం నాయకులు నర్సారెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఆయనవెంట కాంగ్రెస్ సీనియర్ నాయకులు నెంటూరు కుమార్, కరుణాకర్, పెద్దోళ్ల నర్సయ్య, ప్రజ్ఞాపూర్ నర్సింలు, చిన్న రాజు, చిన్న మల్లేశ్, సతీష్, హరిదాస్ తదితరులున్నారు.


కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న నర్సారెడ్డి

పోలింగ్ కేంద్రాలు లేక.. తప్పని తిప్పలు


మండలంలోని సూరంపల్లిలో ఓటు వేయడానికి క్యూలో నిలుచున్న ముత్యంపేట గ్రామస్థులు(ఫైల్)

దౌల్తాబాద్, ఏప్రిల్ 11: ప్రజాప్రతినిధులను, ప్రభుత్వాలను ఎన్నుకోవడానికి భారత రాజ్యాంగం 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించింది. లోక్‌సభ ఎన్నికల నిర్వహణకు షెడ్యూల్ వెలువడడంతో అటు అధికార యంత్రాంగం, ఇటు రాజకీయ పార్టీలు తలమునకలయ్యాయి. మండలంలోని మల్లేశంపల్లి, శౌరీపూర్, ముత్యంపేట, హైమద్‌నగర్ గ్రామ పంచాయతీలకు పోలింగ్ కేంద్రాలు లేక ఓటర్లు అవస్థలు పడుతున్నారు. గ్రామాల్లో పోలింగ్ కేంద్రాలు లేక పోవడంతో చాలా మంది కాలినడకన 3 నుంచి 4 కిలోమీటర్లు వెళ్లి తమ ఓటు హక్కును వినియోగించుకుంటున్నారు. త్వరలో జరిగే పార్లమెంట్ ఎన్నికలకైన గ్రామాల్లో పోలింగ్ కేంద్రాలు ఏర్పాటే చేసి, తమ గ్రామాల ఓటర్లకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని ప్రభుత్వాన్ని, ఎలక్షన్ కమిషన్‌ను కోరుతున్నారు. పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయని పక్షంలో ఎన్నికలను బహిష్కరిస్తామని మల్లేశంపల్లి శౌరీపూర్, ముత్యంపేట, హైమద్‌నగర్ గ్రామాల ప్రజలు హెచ్చరిస్తున్నారు.

పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేయాలి

గ్రామంలో పోలింగ్ కేంద్రం లేక గ్రామస్థులు ఓటు వేయడానికి ముబారస్‌పూర్ జిల్లాపరిషత్ పాఠశాలకు 3 నుంచి 4 కిలో మీటర్లు వెళ్లాల్సి వస్తున్నది. వృద్ధులు, గర్భిణులు, వికలాంగులు, వాహనాలు లేని వారు చాలా అవస్థలు పడుతున్నారు. ఎలక్షన్ కమిషన్, ప్రభుత్వ యంత్రాంగం త్వరలో జరిగే పార్లమెంట్ ఎన్నికలకైన పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేయాలి. లేకపోతే ఎలక్షన్స్ బహిష్కరిస్తాం

- దార సత్యనారాయణ, మల్లేశంపల్లి,శౌరీపూర్ గ్రామపంచాయతీ మాజీ సర్పంచ్

చికిత్స పొందుతూ గీత కార్మికుడి మృతి


జగదీష్ (ఫైల్)

నంగునూరు, ఏప్రిల్ 11: ఆత్మహత్య యత్నానికి పాల్పడిన గీత కార్మికుడు చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ సంఘటన నంగునూరు మండలంలోని ముండ్రాయిలో గురువారం చోటుచేసుకున్నది. గ్రామానికి చెందిన సాదుపల్లి జగదీష్ (30) గీత కార్మికుడిగా పని చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. కుటుంబ పోషణ కోసం చేసిన అప్పులు తీర్చలేక మనస్తాపనికి గురైన జగదీష్ బుధవారం ఇంటి వద్ద గడ్డి మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం సిద్దిపేట అర్బన్ మండలం మిట్టపల్లి సమీపంలోని ఒ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం హైదరాబాదులోని నిమ్స్‌కు తరలించగా చికిత్స పొందుతూ గురువారం సాయంత్రం మృతి చెందాడు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రాజగోపాలపేట పోలీసులు తెలిపారు.

బాలల కథా సంకలనానికి నందిని కథ ఎంపిక


నందిని

నారాయణరావుపేట, ఏప్రిల్ 10: తెలంగాణ సారస్వత పరిషత్తు బాలల కథా సంకలనం కోసం రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థుల నుంచి సేకరించిన కథలలో, తమ పాఠశాల ఎనిమిదో తరగతి విద్యార్థిని బోయిని నందిని కథ ఎంపికైనట్లు నారాయణరావుపేట మండలం జక్కాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సయ్యద్ షౌకత్ అలీ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థిని ప్రోత్సాహించిన ఉపాధ్యాయుడు భైతి దుర్గయ్యను ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అభినందించారు.

అఖిల భారత కిసాన్‌సభ ఆవిర్భావ దినోత్సవం

- సంఘం పతాకాన్ని ఎగురవేసిన నాయకులు

చేర్యాల, ఏప్రిల్ 11 : అఖిల భారత కిసాన్‌సభ ఆవిర్భావ దినోత్సవాన్ని గురువారం చేర్యాల, కొమురవెల్లి మండలాలలో ఆ సంఘం నాయకులు ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా చేర్యాలలో నిర్వహించిన కార్యక్రమంలో సంఘం రాష్ట్ర కమిటీసభ్యుడు నక్కల యాదవరెడ్డి, కొమురవెల్లి మండలకేంద్రంలో ఏఐకేఎస్ మండల కార్యదర్శి బద్దిపడిగ కృష్ణారెడ్డి సంఘం పతాకాన్ని ఆవిష్కరించారు.

వార్‌రూమ్ కో ఆర్డినేటర్‌గా రాహుల్‌రెడ్డి

జగదేవ్‌పూర్, ఏప్రిల్ 11: పీసీసీ వార్‌రూమ్ కోఆర్డినేటర్‌గా కొత్త రాహుల్‌రెడ్డి నియమితులయ్యారు. రాష్ట్రానికి సిద్దిపేట జిల్లా జగదేవ్‌పూర్‌కు చెందిన కొత్త రాహుల్‌రెడ్డిని ఏఐసీసీ నియమించింది. 2024 ఎన్నికలు ముగిసే వరకు రాహుల్‌రెడ్డి బాధ్యతలు నిర్వహిస్తారని కాంగ్రెస్ ప్రొఫెషనల్ వింగ్ చైర్మన్ ప్రవీణ్ చక్రవర్తి తెలిపారు. ఈ సందర్భంగా రాహుల్‌రెడ్డి మాట్లాడుతూ.. ఏఐసీసీ నేత రాహుల్‌గాంధీకి, సీఎం రేవంత్‌రెడ్డిలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. యువజన కాంగ్రెస్ నియోజకవర్గ మాజీ అధ్యక్షుడు భాను ప్రకాశ్‌రావు, కాంగ్రెస్ జగదేవ్‌పూర్ మండల మాజీ అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు విజయ్‌కుమార్, ఐఎన్టీయూసీ జిల్లా అధ్యక్షుడు రవీందర్, గజ్వేల్ నియోజకవర్గ యువజన కాంగ్రెస్ మాజీ ప్రధాన కార్యదర్శి బునారి రాజు, బీసీసెల్ జగదేవ్‌పూర్ మండల నాయకులు దండు రవి, చెక్కల నరేశ్, ఎస్సీసెల్ నాయకులు పైసా స్వామి, కిసాన్ సెల్ అధ్యక్షుడు పరశురాములు, ఎన్ఎస్‌యూఐ నాయకులు భానులు రాహుల్‌రెడ్డిని శాలువాతో సత్కరించారు.

హరీశ్‌రావుకు ఆహ్వానం

నారాయణరావుపేట, ఏప్రిల్ 11: ఈ నెల 18 నుంచి నారాయణరావుపేట మండల కేంద్రంలో నిర్వహించే బీరప్పా,కామరాతి కల్యాణ వేడుకలకు రావాలని మాజీమంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావుకు, ఎమ్మెల్సీ, మెదక్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామారెడ్డిలకు గురువారం సిద్దిపేట క్యాంపు కార్యాలయంలో గొల్ల, కురమ సంఘాల ప్రతినిధులు ఆహ్వాన పత్రికను అందజేశారు. ఉత్సవాలకు తప్పకుండా హాజరవుతానని హరీశ్‌రావు తెలిపారు. కార్యక్రమంలో గొల్ల, కుర్మ సంఘాల ప్రతినిధులు పల్లెబోయిన కనకయ్య, ముత్తయ్య, బాలమల్లు, చెన్నయ్య, ఎంపీపీ ఉపాధ్యక్షుడు సంతోష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.


హరీశ్‌రావుకు ఆహ్వాన పత్రిక అందజేస్తున్న గొల్ల, కుర్మ సంఘం ప్రతినిధులు

సమావేశానికి తరలిన బీజేపీ నాయకులు

మర్కుక్, ఏప్రిల్ 11: బీజేపీ మెదక్ పార్లమెంట్ నాయకులు, కార్యకర్తల సమావేశానికి మర్కుక్ మండల అధ్యక్షుడు సాయిరెడ్డి రామిరెడ్డి ఆధ్వర్యంలో మండలం నుంచి బీజేపీ నాయకులు తరలివెళ్లారు. కార్యక్రమంలో రాష్ట్ర బీజేపీ నాయకుడు, మాజీ జడ్పీటీసీ సింగం సత్తయ్య, సీనియర్ నాయకుడు, మండల మాజీ అధ్యక్షుడు రమేశ్‌గుప్త, సీనియర్ నాయకుడు కృష్ణమూర్తి, మండల ప్రధాన కార్యదర్శి రాజేందర్‌సింగ్, తిరుపతిరెడ్డి, ఉపాధ్యక్షుడు మహేష్‌గౌడ్, బీసీ మోర్చా అధ్యక్షుడు శ్రీనివాస్, బీజేవైఎం అధ్యక్షుడు మధు, కుంట సత్యం, వివిధ గ్రామాల బూత్ అధ్యక్షులు నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

బీజేపీ మెదక్ పార్లమెంట్ కో కన్వీనర్‌గా శ్రీనివాస్

గజ్వేల్, ఏప్రిల్ 11: బీజేపీ మెదక్ పార్లమెంట్ కో కన్వీనర్‌గా నలగామ శ్రీనివాస్‌ను నియమిస్తూ, బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడిగా, బీజేపీ జిల్లా కోఆర్డినేటర్‌గా ఇటీవల అసెంబ్లీ ఎన్నికల్లో పనిచేసిన నలగామ శ్రీనివాస్‌ను పార్లమెంట్ కో కన్వీనర్‌గా నియమించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి, బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్ కుమార్‌లకు కృతజ్ఞతలు తెలిపాడు.

రఘునందన్‌రావును భారీ మెజార్టీతో గెలిపించుకుంటాం

ములుగు, ఏప్రిల్ 11: బీజేపీ మెదక్ పార్లమెంట్ అభ్యర్థి రఘునందన్‌రావును భారీ మెజార్టీతో గెలిపించుకోవడం కోసం కలిసికట్టుగా పని చేయాలని బీజేపీ జిల్లా నాయకుడు, మండల పార్టీ మాజీ అధ్యక్షుడు పల్లె రమేశ్ యాదవ్ కోరారు. గురువారం మండల కేంద్రమైన ములుగులో ఇంటింటి ప్రచారం నిర్వహించి, బీజేపీ క్యాలెండర్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశ ప్రజల సంక్షేమం కోసమే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పని చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో మహిళా మోర్చ ప్రధాన కార్యదర్శి కట్ట భాగ్యలక్ష్మి, ములుగు బూత్ అధ్యక్షుడు రమేశ్, స్వామి, కురుమ రాజయ్య, మల్లయ్య యాదగిరి, కిష్టయ్య, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

అలయన్స్ క్లబ్ సేవలు అభినందనీయం

సిద్దిపేటరూరల్, ఏప్రిల్ 11: అంతర్జాతీయ స్థాయిలో ఏర్పడిన అలయన్స్ క్లబ్ సిద్దిపేట జిల్లాలో అందిస్తున్న సేవలు అభినందనీయమని అలయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ సి.బాలచంద్రన్ అన్నారు. గురువారం సిద్దిపేట జిల్లా అలయన్స్ క్లబ్ నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సిద్దిపేట క్లబ్ ఆధ్వర్యంలో మరో రెండు నూతన క్లబ్‌లను ఏర్పాటు చేయడం సంతోషకరమని ఇంటర్నేషనల్ వైస్ ప్రెసిడెంట్ డీబీఎస్ శాస్త్రి అన్నారు. జిల్లా గవర్నర్‌గా ఎంపికైన చకిలం బాలచంద్రంతో పాటు కార్యవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో అలయన్స్ క్లబ్ మాజీ గవర్నర్‌లు, రీజనల్, జోనల్ చైర్మన్‌లు, ప్రతినిధులు ఆత్మరాములు, సత్యనారాయణ, సోమ వనజ, రాజేశ్వర్ రెడ్డి, వైకుంఠం, అంతయ్య, శివకుమార్, రామచంద్రం, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జ్యోతిరావు పూలే జయంతి

చేర్యాల, ఏప్రిల్ 11 : మహాత్మా జ్యోతిరావుపూలే 197వ జయంతిని చేర్యాల, కొమురవెల్లి మండలాలలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చేర్యాల పట్టణంలో నిర్వహించిన కార్యక్రమంలో టీఎస్‌యూటీఎఫ్ నాయకుడు కొడిపల్లి ప్రశాంత్‌కుమార్, మేర్గోజు మల్లేశం, బి.సత్యనారాయణ, కొమురవెల్లిలో కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు బాలకిషన్, ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి తాడూరు భరత్ పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

- **కొండపాక:** కొండపాక, దుద్దెడ, వెలికట్ట క్రాస్ రోడ్డు తదితర గ్రామాల్లో పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు లింగారావు, జిల్లా ప్రధాన కార్యదర్శి అనంతుల నరేందర్, ఉపాధ్యక్షుడు ఏర్పుల మల్లేశం, అంబేడ్కర్ సంఘం నాయకులు పాల్గొన్నారు.
- **చిన్నకోడూరు:** చిన్నకోడూరులో జ్యోతిరావుపూలే చిత్రపటానికి సర్పంచ్‌ల ఫోరం మాజీ మండలాధ్యక్షుడు కాముని ఉమేష్ చంద్ర, బీఆర్ఎస్ నాయకుడు జంగిటి శ్రీనివాస్ పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు రమేష్, మధు, ప్రభాకర్ పాల్గొన్నారు.
- **గజ్వేల్:** గజ్వేల్‌లోని అంబేడ్కర్ సర్కిల్‌లో పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి, భారత రాజ్యాంగ పరిరక్షణ ప్రచారోద్యమాన్ని డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి పి.శంకర్ గురువారం ప్రారంభించారు. కార్యక్రమంలో దళిత ఉద్యోగుల ఐక్య వేదిక నాయకుడు పంబాల ఎల్లయ్య, డీబీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి దాసరి ఏగొండస్వామి, ప్రజా కళాకారులు జాలిగామ బాల్ నర్సయ్య, ఎర్ర మల్లేశం, డీబీఎఫ్ జిల్లా కార్యదర్శి బి.వేణు తదితరులు పాల్గొన్నారు.


చేబర్తిలో పూలే విగ్రహానికి పూలమాలలు వేస్తున్న దృశ్యం

- **హుస్నాబాద్ టౌన్:** హుస్నాబాద్ పట్టణంలో గురువారం మహాత్మా జ్యోతిరావుపూలే జయంతి వేడుకలను కాంగ్రెస్, దళిత బహుజన సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమాల్లో మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ అయిలేని అనిత, జేఏసీ కో ఆర్డినేటర్ మేకల వీరన్న యాదవ్, టీపీసీసీ మెంబర్ కేడం లింగమూర్తి, సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, మాజీ ఎంపీపీ ఆకుల వెంకట్, ముక్కెర సంపత్‌కుమార్, కొయ్యడ కొంరయ్య, బీసీ సంక్షేమ సంఘం నాయకుడు పచ్చిమట్ల రవీందర్‌గౌడ్ తదితరులున్నారు.
- **వర్గల్:** మండల కేంద్రంలోని మహాత్మా జ్యోతిరావు పూలే రెసిడెన్షియల్ మహిళా డిగ్రీ కళాశాలలో జ్యోతిబాపూలే జయంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు మెదక్ ఆర్సీవో ప్రభాకర్ ముఖ్య అతిథిగా హాజరై పూలే చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ బాస్కర్‌రావు, వైస్ ప్రిన్సిపాల్ గోవిందరావు, భాగ్యలక్ష్మి, అధ్యాపక బృందం పాల్గొన్నారు.
- **మర్కుక్:** చేబర్తిలో గురువారం మహాత్మాజ్యోతిరావు పూలే 197వ జయంతి సందర్భంగా మహనీయుల ఉత్సవ కమిటీ చైర్మన్ జాలని యాదగిరి, కో కన్వీనర్ కనకరాజు ఆధ్వర్యంలో జడ్పీటీసీ మంగమ్మ రామచంద్రం యాదవ్, వంటిమామిడి మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ రాందాస్‌గౌడ్ సావిత్రి బాయి, జ్యోతిరావుపూలే విగ్రహాలకు పూలమాలలు వేసి జయంతి వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ తాజా మాజీ ఉపసర్పంచ్ గుర్రాల స్వామి, నాయకులు గ్యార మల్లేష్, గుడాల శేఖర్‌గుప్త, ర్యాకం యాదగిరి, రాంబాబు, కొండ యాదగిరి, బాలకృష్ణ తదితరులున్నారు.


హుస్నాబాద్‌లో జ్యోతిరావుపూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

- **దూళిమిట్ట:** మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ నాయకులు సుందరగిరి భాస్కర్ ఆధ్వర్యంలో మహాత్మా జ్యోతిరావు పూలే 198 జయంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచులు దుబ్బుడు దీపిక వేణుగోపాల్‌రెడ్డి, సుద్దాల రేణుక నర్సింహులు పాల్గొన్నారు.
- **సిద్దిపేట అర్బన్:** సిద్దిపేటలో జనవిజ్ఞాన వేదిక, నవజీవన్ ఎంప్లాయీస్ యూనియన్ సొసైటీ, బహుజన సమాజ్ పార్టీ, పీడీఎస్‌యూ, సీఐటీయూ, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పూలే జయంతి వేడుకలను నిర్వహించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి కాముని గోపాల స్వామి ఆయా పార్టీల నాయకులు పాల్గొన్నారు.
- **జగదేవ్‌పూర్:** జగదేవ్‌పూర్‌లో జ్యోతిరావుపూలే జయంతి వేడుకలు నిర్వహించారు. స్థానిక అంబేడ్కర్ చౌరస్తాలో జ్యోతిబాపూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గడ్డం కనకయ్య, తుర్కపల్లి అరుణ్, మచ్చ దినేష్ మచ్చ హరీశ్, మచ్చ బాబు, తుర్కపల్లి నాగరాజు, గడ్డం ప్రణయ్‌కుమార్, గడ్డం భాను తదితరులున్నారు.